శైవక్షేత్రాలకు కార్తీక శోభ

సింహాద్రిపురం : అహోబిలాపురం సమీపంలోని భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రం, గురిజాల గురుగుట్ట సమీపంలోని ఆలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం లక్ష దీపారాధనకు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తారు. భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలో కార్తీక మాసం రెండవ సోమవారం లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు బద్రినాథ శర్మ తెలిపారు. గురుగుట్టలో లక్ష దీపారాధన నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆడుదాం.. ఆంధ్ర క్రీడోత్సవాలపై సమీక్ష

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడోత్సవాలపై శనివారం ఎర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ మాట్లాడుతూ సోమవారం నుంచి క్రీడాకారులు ఎంపిక ప్రక్రియను ప్రారంభిసుస్తున్నట్లు తెలిపారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలలో పురుషులకు, స్త్రీలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడలలో ఆసక్తి గల సచివాలయ సిబ్బంది పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శివ ప్రసాద్, మున్సిపల్ ఆర్ఓ గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలి

వేముల : మండలంలో నాడు–నేడు ఫేజ్–2 కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనులను నాణ్యతగా చేపట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునీత తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల హెడ్మాస్టర్లు, పాఠశాలల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో 21 అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు ఫేజ్–2 కింద అభివృద్ధి చేసేందుకు ఎంపికయ్యాయన్నారు. ఈ కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు, గోడలకు పెయింటింగ్ వంటి మౌలిక వసతుల కల్పనకు ఏడు మందితో కూడిన కమిటీ ద్వారా పనులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని 2 నుంచి 4 ఏళ్ల పిల్లల తల్లులు ముగ్గురు ఉండాలని, వీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను పారదర్శకంగా, నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్యలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునీత

వేంపల్లె : అంగన్‌వాడీ భవనాల మరమ్మతుల నిర్మాణం నాణ్యతగా నిర్మించాలని సీడీపీఓ వి.సునీత సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మన అంగన్‌వాడీ నాడు–నేడు పథకం ఫేజ్–2 కింద ఎంపికైన ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 14 అగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఒక్కో వాటికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. భవనాల మర్మత్తుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకకు సంబంధించి ఏడుమంది సభ్యులతో కూడిన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలాగే బ్యాంక్‌లో ఖాతాలు తెరవాలని సూచించారు. పనుల సంబంధిత రిజిస్టర్, నగదు ఖాతా, చెక్ బుక్‌లను కలిగి పారదర్శకంగా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ లోకేష్, హెచ్‌ఎం మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కమలాపురం ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి తెలిపారు. శనివారం స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె మండలాల్లో 87 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు ఫేజ్–2బి ద్వారా అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగ్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు తదితర వసతులు మెరుగు పరచుకోవాలన్నారు. 7 మంది కమిటీ సభ్యులు ఈ పనులను పరి శీలిస్తారన్నారు. పనులు చేయు విధానంపై శిక్షణ నిచ్చారు.

ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

కమలాపురం : నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్నరెడ్డి పల్లెలోని గాడిదల వంకలో రూ.4 లక్షల సొంత నిధులతో చేస్తున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినపుడు గ్రామానికి చెందిన సత్తార్ తదితరులు ఈ గాడిదల వంకలో పూడిక తీయకపోవడం వలన వరద నీరంతా తమ ఇళ్లలోకి వస్తున్నాయని, పూడిక తీయాలని కోరడంతో రూ.4 లక్షల సొంత నిధులతో గాడిదల వంకలో నాలుగు రోజులుగా పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమా రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, బుజ్జన్న, పుల్లారెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవి అలంకారంలో గౌరిదేవి

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరిదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆలయ అధ్యక్షులు ఎస్.కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఎస్.ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు యాడాల నాగయ్య, వెలుగోటివ ఎంకటేష, డాక్టర్ ఎస్.రాజారాం, యాడాల పెద్దసుబ్బరాయుడులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9గంటలకు కటిక శివ రాయల్, కటిక నాగరాజుల ఆధ్వరయలో ఆర్కెస్ట్రా నిర్వహించారు. అలాగే స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీదుర్గా గవిమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక దీపారాధన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

మండల అభివృద్ధికి సహకరించండి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరూ సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై గ్రామాలల్లో ప్రజలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

పులివెందుల టౌన్ : పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అయ్యప్ప, శివమాలలు ధరించిన భక్తులకు శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్యలు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు భోజనం వడ్డిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

‘పులివెందులలో అభివృద్ధి కనిపించలేదా’

పులివెందుల రూరల్ : బుగ్గయ్య చౌదరి నోరు అదుపులో పెట్టుకుని పులివెందులలో అభివృద్ధి జరిగిందో లేదో తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగపు అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని అక్రమంగా అరెస్టు చేశారని, పులివెందులలో అభివృద్ధి జరగలేదని పులివెందుల నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు బుగ్గయ్య చౌదరి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులపై దాడి చేసిన కేసులో చట్టం తన పని తాను చేసుకుని బీటెక్ రవిని అరెస్టు చేసిందన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే పులివెందులలో ఎంతో అభివృద్ధి జరిగిందని వాటిని ఒకసారి పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఉనికి కాపాడుకునేందుకు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్‌రెడ్డి, మహీంద్ర, కిరణ్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

కమలాపురం : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో మీకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఈఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం అని, మీరంతా తమకు కేటాయించిన విధుల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి అంతా సరఫరా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. మాక్ పోలింగ్ జరిగే సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే కొత్త ఈవీఎంలు ఏర్పాటు చేసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అసెంబ్లీకి కేటాయించిన ఈవీఎంలను అసెంబ్లీకే, పార్లమెంటుకు కేటాయించిన ఈవీఎంలను పార్లమెంటుకే ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా ఇబ్బంది పడకుండా ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిశీలించాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉందన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు సరస్వతి, శంకరయ్య, అలీఖాన్, నారాయణరెడ్డి, ఉదయ్ భాస్కర్‌రాజు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ చంద్రమోహన్

మహిళలు స్వయం సంవృద్ధి సాధించాలి

వల్లూరు : మహిళలు స్వయం సంవృద్ధి సాధించడం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాలను అభివృద్ధి పథంలో నిలపడానికి అవకాశం కలుగుతుందని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు వున్నాయని, వాటిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలన్నారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. మండల సమాఖ్య ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సీసీలు, ఐకేపీ సిబ్బంది, వీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

వేంపల్లె : 1950 జనవరి 26వ తేదీన అధికారికంగా అంగీకరించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. శనివారం కళాశాల రాజనీతి శాస్త్రం, చరిత్ర శాఖ సంయుక్తంగా నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ముసాయిదా కమిటీ దాదాపు రెండేళ్ల 11నెలల 18రోజులపాటు 299 మంది 344 సుదీర్ఘ రాజ్యాంగాన్ని తయారు చేశారన్నారు. భారత రాజ్యాంగం దాదాపు 448 ఆర్టికల్స్ 22 భాగాలు, 12 షెడ్యూల్స్, 5 అపెండెన్స్‌లతో కూడి ఉందన్నారు. అధ్యాపకురాలు ఎల్.నాగలక్ష్మి, లైబ్రేరియన్ మాధవరావు, సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం మండల పరిధి గూడెంచెరువు గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు 18 సంవత్సరాల వరకు తమ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ముందుగా విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన భోజనాలను ఆమె పరిశీలించారు. హస్టల్‌లో ఏమైన సమస్యలు ఉంటే తనకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి భార్గవి

పంచక్షేత్ర దర్శినిని సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం పంచక్షేత్ర దర్శిని స్పెషల్ బస్సులను మూడు సోమవారాలు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బస్సులను శైవ క్షేత్రాలకు నడుపుతున్నామన్నారు. యాగంటి, నందవరం, మహా నంది, ప్రొద్దుటూరు రామేశ్వరం, కన్యతీర్థం శైవ క్షేత్రాలకు కార్తీక సోమవారం ఉదయం 5 గంటలకు పులివెందుల బస్సు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ.550లు, పిల్లలకు రూ.300లు చెల్లించి ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు. పులివెందుల ప్రాంతంలోని శైవ క్షేత్రాలైన పాలతల, భానుకోట, కోన మల్లేశ్వరస్వామి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వివరాలకు 7989899479, 9959225780 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలి

వేంపల్లె : మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలని ఎంపీడీఓ ఎస్.దివిజ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలు, బాలికలపై హింసకు వ్యతిరేక జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 18 ఏళ్లు నిండకుండా ఆడపిల్లలకు వివాహం చేయరాదని, ఆడపిల్లలను చదివించాలనే నినాదాలతో డ్వాక్రా మహిళలు ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి రంగంలో ఆడపిల్లలు దూసుకపోవాలని, అలా జరగాలంటే వారిని చక్కగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు, వెలుగు సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, డ్వాక్రా మహిళలు

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

జమ్మలమడుగు : డిశంబర్ 15 నుంచి నెల్లూరులో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న శనివారం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో కరపత్రాలను విడుదల చేశారు.